“ఏ స్త్రీ తన భర్తతో, లేదా ఒక ‘మహ్రం’ తో తప్ప రెండు రోజుల సుదూర ప్రయాణంలో (ఒంటరిగా) ప్రయాణించరాదు

అబూ సయీద్ ఖుద్రీ రజియల్లాహు అన్హు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తో పాటు పన్నెండు యుద్ధాలలో పాల్గొన్నారు. ఆయన ఇలా ఉల్లేఖిస్తునారు: “ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నుండి నేను నాలుగు విషయాలు విన్నాను. అవి నాకు బాగా నచ్చాయి: “ఏ స్త్రీ తన భర్తతో, లేదా ఒక ‘మహ్రం’ తో తప్ప రెండు రోజుల సుదూర ప్రయాణంలో (ఒంటరిగా) ప్రయాణించరాదు; రెండు దినములు ఉపవాసాములు పాటించరాదు ఈద్ అల్ ఫిత్ర్ దినము నాడు, మరియు ఈద్ అల్ అజ్’హా దినము నాడు; ఫజ్ర్ నమాజు తరువాత సూర్యుడు (పూర్తిగా) ఉదయించే
వరకు ఏ నమాజు లేదు, అస్ర్ నమాజు తరువాత సూర్యుడు (పూర్తిగా) అస్తమించే వరకు ఏ నమాజు లేదు; మూడు మస్జిదులకు తప్ప తీర్థయాత్ర చేయరాదు – మస్జిదుల్ హరాం, మస్జిదుల్ అఖ్సా, మరియు ఈ మస్జిద్ (అంటే మదీనాలో ఉన్న ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి మస్జిద్
- మస్జిదె’నబవీ).”
[ప్రామాణికమైన హదీథు] [అల్ బుఖారీ మరియు ముస్లిం నమోదు చేసినారు]

ఈ హదీసులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నాలుగు విషయాలను నిషేధించినారు: మొదటిది: ఒక స్త్రీ తన భర్త లేదా ఆమె ‘మహరమ్ పురుషులలో’ ఒకరు లేకుండా రెండు రోజుల సుదూర ప్రయాణంలో (ఒంటరిగా) ప్రయాణించకుండా నిషేధించడం; ‘మహరమ్ పురుషులు’ అంటే ఆమెను వివాహం చేసుకోవడం శాశ్వతంగా నిషేధించబడినవారు, ఉదాహరణకు: ఆమె బంధువులలో - ఆమె కొడుకు, తండ్రి, మామ, సోదరుడు, సొదరుని కొడుకు, సోదరి కొడుకు, తల్లి సోదరులు, లేదా తండ్రి సోదరులు వంటి బంధువులు మొదలైన వారు. రెండవది: ఒక ముస్లిం ఈద్ అల్ ఫిత్ర్ దినము నాడు మరియు ఈద్ అల్ అద్’హా దినము నాడు ఉపవాసము పాటించుటను నిషేధించినారు; అతడు మొక్కుబడిగా మొక్కుకుని ఉన్న ఉపవాసమును పాటించ దలచినా, లేక స్వచ్ఛంద (నఫిల్) ఉపవాసము పాటించ దలచినా, లేక పరిహారంగా పాటించవలసి ఉన్న ఉపవాసమును పాటించదలచినా – ఈ రెండు దినములలో పాటించరాదు. మూడవది: అస్ర్ నమాజు తరువాత సూర్యాస్తమయం వరకు ఏదైనా నఫిల్ నమాజు పాటించుట, మరియు ఫజ్ర్ నమాజు తరువాత సూర్యోదయం వరకు ఏదైనా నఫిల్ నమాజు పాటించుట – ఈ రెండూ నిషేధించబడినవి. నాలుగవది: మూడు మస్జిదులకు తప్ప – ఏదైనా ఒక నిర్దుష్ఠ ప్రదేశానికి, ఆ ప్రదేశము మహత్తు గల ప్రదేశము అని, లేదా అది మహా ఘనత గల ప్రదేశము అని, లేదా ఆ ప్రదేశాన్ని దర్శించడం వల్ల పుణ్యాలు రెట్టింపు అవుతాయని – ఇలాంటి విశ్వాసాలతో ప్రయాణించడం నిషేధించబడినది. కనుక, ఏ ఇతర మస్జిదులకు ప్రత్యేకంగా ప్రయాణం చేసి వెళ్ళరాదు, ఎందుకంటే ఈ మూడు మస్జిదులలో మాత్రమే పుణ్యఫలం రెట్టింపు అవుతుంది – అవి ఒకటి మస్జిదుల్ హరాం, రెండు మస్జిదున్’నబవీ మరియు మూడు మస్జిదుల్ అఖ్సా.

http://www.sunnah.global/hadeeth/te/show/10603